

అసంపూర్తి పనులు..

నిత్యం అవస్థలు

అర్ధాంతరంగా నిలిచిన మోర్గి వంతెన పనులు

రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో రాకపోకలకు ఇబ్బందులు

వర్షానికి అధ్వానంగా మారిన తాత్కాలిక రహదారి

మోకాలు లోతు గుంతలు

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద ఆగస్టు 10: అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో నిర్మించ తలపెట్టిన వంతెన అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో, రెండు రాష్ట్రాల వాహనదారులకు నిత్యం నరకం కనిపిస్తున్నది. నారాయణఖేడ్ నియోజకవర్గం గుండా ప్రవహించే మంజీరా నదికి అవతలి వైపు కర్ణాటక రాష్ట్రం ఉంటుంది. మంజీరా నదిపై మోర్గి-చిల్లర్గి గ్రామాల మధ్య రెండు రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ రెండు దశాబ్దాల క్రితం వంతెనను నిర్మించారు. నారాయణఖేడ్ నుంచి కర్ణాటకలోని బీదర్‌కు ప్రజలు ఈ రహదారి మీదుగానే రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఖేడ్ ప్రాంత వాసులే కాకుండా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రజలు కూడా కర్ణాటకకు వెళ్లడానికి ఈ రహదారినే ఆశ్రయిస్తారు. వాహనాల రద్దీ పెరగడంతో కరస్‌గుత్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మోర్గి మీదుగా రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డును హైలెవల్ వంతెనను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం రూ.6.32 కోట్లు మంజూరు చేసింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు ఈ పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు పూర్తయ్యాయి. కానీ, వంతెన నిర్మాణం పిల్లర్ల దశలోనే ఆగిపోయింది. దీంతో, వాహనాల రాకపోకలు సాగించడానికి పక్క నుంచి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా వేసిన ఈ ఫార్మేషన్ రోడ్డు వర్షాలకు అధ్వాన్నంగా మారి వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నది. మోకాలు లోతు గుంతల్లో వర్షం నీరు నిలవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ద్విచక్రవాహనాలు ఈ రోడ్డు దాటడమే గగనంగా మారుతున్నది. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణాన్ని పూర్తిచేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జి నిర్మాణం కోసం వేసి పిల్లర్లు

బ్రిడ్జి లేక అవస్థలు



మోర్గి సమీపంలో చేపట్టిన వంతెన నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. తరచుగా ఈ రోడ్డు గుండానే బీదర్‌కు రాకపోకలు సాగిస్తుంటాం. బ్రిడ్జి పనులు పూర్తికాకపోవడంతో వాహనాలు నడపడం కష్టంగా మారింది.

-సుధాకర్, వాహనదారుడు

నిత్యం ఇబ్బందులే..



వంతెన పనులు పూర్తికాక పోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలవుతున్నా ఇప్పటికీ పూర్తికాలేదు. వంతెన పనులను మధ్యలోనే ఆపేశారు. కొంతకాలంగా ఎలాంటి పనులు చేయడం లేదు.

-కాశీనాథ్, మోర్గి

వెంటనే పూర్తిచేయించాలి



గ్రామ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నిచిపోవడంతో ఈ రహదారి గుండా ప్రయాణం చేయడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఏడాదిగా పనులే జరగడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిర్మాణ పనులను పూర్తిచేయాలి.

- భద్రినాథ్, మోర్గి

వనదుర్గమ్మ ఆలయంలో చోరీ

అర్ధరాత్రి హుండీలు బయటకు తీసుకెళ్లి పగులగొట్టిన దొంగలు

10 రోజుల హుండీ ఆదాయం దొంగతనం

సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం.. పోలీసులు గస్తీ చేపట్టిన రోజే ఘటన



దొంగలు ఎత్తుకెళ్లి పగులగొట్టిన హుండీ



సీసీ కెమెరాల్లో రికార్డయిన దొంగతనం దృశ్యం

పాపన్నపేట, ఆగస్టు 10: మెదక్ జిల్లా ఏడుపాయల వన దుర్గ అమ్మవారి ఆలయ హుండీ చోరీకి గురైంది. ఆలయంలోనే హుండీని ఎత్తుకెళ్లిన దొంగలు దానిని పగుల గొట్టి పది రోజుల ఆలయ ఆదాయాన్ని ఎత్తుకెళ్లారు. పోలీసులు ఏడుపాయల్లో గస్తీ తిరిగిన రోజే రాత్రి ఆలయంలో చోరీ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా ఎన్నోమార్లు ఆలయంలో హుండీలను పగలగొట్టి దోచుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్లితే.. ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయ మండపంలోకి శుక్రవారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించారు. ఆలయం దక్షిణం వైపు తలుపు తాళం పగులగొట్టి లోపలికి వెళ్లిన దొంగలు మండపంలోని హుండీతో పాటు 12వ నంబర్ హుండీని ఎత్తుకెళ్లారు. వాటిని ఆలయానికి వంద మీటర్ల దూరం తీసుకెళ్లి పగుల గొట్టి, అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఖాళీ హుండీలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. పది రోజుల క్రితమే హుండీ లెక్కించడంతో పెద్దగా నగదు పోలేదని భావిస్తున్నారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆలయంలో ఆధారాలు సేకరించారు.

అప్రమత్తం చేసినా..

పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం రాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా ఏడుపాయల ఈవో కార్యాలయం వరకు వెళ్లారు. ఆలయ సెక్యూరిటీ సిబ్బంది అక్కడ ఉండటంతో దేవాలయం వద్ద ఉండకుండా ఇక్కడేం చేస్తున్నారని ఎస్‌ఐ ప్రశ్నించి, ఆలయానికి వెళ్లాలని సూచించారు. అయినా, వారు అక్కడే ఉండటం.. అంతకు కొద్ది నిమిషాల ముందే దొంగలు తమ కానిచ్చుకుని దర్జాగా వెళ్లినట్లు తెలుస్తోంది.

సీసీ టీవీ కెమెరాలు ఉన్నా..

ఏడుపాయల ఆలయంలో ఎలాంటి సంఘటన జరిగినా ప్రత్యక్షంగా వీక్షించేందుకు సీసీ టీవీ కెమెరాలు ఉన్నాయి. వాటిని ఈవో కార్యాలయానికి అనుసంధానం చేశారు. ఈ సీసీటీవీలను ఆలయ భద్రతా సిబ్బంది నిరంతరం గమనిస్తూ ఉండాలి. అయితే, దొంగతనం జరిగినప్పుడు సీసీటీవీల వద్దనే ఉన్న సిబ్బంది ఆలయంలో దొంగలు పడిన విషయాన్ని గమనించలేదు. ఆలయ మంటపంలో ఉన్న సీసీ కెమెరాలో దొంగతనం జరిగిన తీరు రికార్డు అయింది. ముసుగు ధరించిన ఇద్దరు ఆలయ తలుపు ఊడదీస్తున్న దృశ్యమూ సీసీ కెమెరాల్లో కనిపిస్తోంది. అయినా, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చోరీ జరిగినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఏడుపాయల్లో పోలీస్ అవుట్ పోస్టు ఉన్నా.. తగినంత సిబ్బంది లేక.. ఉన్న సిబ్బంది నామమాత్రంపు విధులకే పరిమితం అవుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

తూప్రాన్/మనోహరాబాద్, ఆగస్టు 10: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. తూప్రాన్, మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషిచేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగ కృష్ణ, ఎస్‌ఐలు సుభాష్‌గౌడ్, శివానంద్ ఉన్నారు.

యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలి



మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్ : విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను అరికట్టడానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని పేర్కొన్నారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని కళాశాలల్లో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే డయల్ 100కు లేదా, 8712657888 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



అసలు లక్షల్లో.. విధింపు వేలల్లో..

- పరిశ్రమల పన్ను గోల్‌మాల్
- తూతూమంత్రంగా వసూళ్లు
- మున్సిపల్ ఆదాయానికి గండి

సదాశివపేట, ఆగస్టు 10: సదాశివపేట బల్దియా పరిధిలో పన్ను వసూళ్లు కొందరికి కాసుల వర్షం కురిపిస్తున్నది. మామూళ్లు తీసుకుని అసలు కంటే తక్కువ పన్ను విధించి కొందరు తమ జేబులు నింపుకుంటున్నారు. పన్ను చెల్లింపుదారులు, మున్సిపల్ సిబ్బంది కలిసి బల్దియా ఖజానాకు గండికొడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో ఉన్న ఓ పరిశ్రమలో బల్దియా మహిళా అధికారి చేసిన తనిఖీలో సంచలన విషయాలు బయటపడ్డట్టు తెలుస్తున్నది. పదేళ్ల క్రితం స్థాపించిన ఈ పరిశ్రమను ఇటీవల విస్తరించడంతో తాజాగా కొలతలు తీసి కట్టాల్సిన పన్ను లెక్క తేల్చారు. ఈ లెక్కల ప్రకారం పరిశ్రమ వాస్తవంగా చెల్లించాల్సిన పన్నుతో పోలిస్తే సగమే కడుతున్నట్టు బయటపడింది. ఈ తేడాను సవరించి కచ్చితమైన పన్నును నిర్ధారించగా.. ఇది అమలులోకి రాకుండా ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకువచ్చి నిలిపివేశారు. ఒక్క పరిశ్రమను తనిఖీ చేస్తేనే దాదాపు రూ.20 లక్షల పన్ను మాఫీ చేసినట్టుగా తేలడం చూస్తే.. మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని పరిశ్రమల్లోనూ పన్ను విధింపులో ఏ స్థాయిలో చేతివాటం ప్రదర్శించారో అర్థమవుతున్నది. గత కొన్నేళ్లుగా పట్టణ పరిధిలో ఓ భారీ పరిశ్రమతో పాటు మరికొన్ని పరిశ్రమలు కొత్తగా విస్తరణ పనులు చేపట్టాయి. అనుమతులు లేకుండానే అక్రమంగా భారీ షెడ్ల నిర్మాణాలు జరిగినట్టు తెలుస్తున్నది. ఇదే రీతిలో పట్టణ పరిధిలోని వ్యాపార సంస్థలు తక్కువ పన్నులు చెల్లిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నట్టు స్పష్టమవుతున్నది. ఇందుకు సహకరిస్తున్న కొందరు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

పరిశ్రమ ట్యాక్స్ పెంచుతాం

పట్టణ పరిధిలో ఇటీవల ఓ పరిశ్రమలో తనిఖీలు చేపట్టాం. పరిశ్రమలో కొత్తగా భారీ నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించాం. నిబంధనల ప్రకారం కట్టడాల కొలతలు తీసుకున్నాం. త్వరలో పరిశ్రమ ట్యాక్స్‌లను పెంచేలా చర్యలు తీసుకుంటాం.

-ఉమ, మున్సిపల్ కమిషనర్

'నీలి'నీడలు



చేప పిల్లల సరఫరాపై సందిగ్ధత

రెండుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు

గతేడాది బిల్లులను నిలిపివేసిన సర్కార్

ఈసారి ఆసక్తి చూపని పంపిణీదారులు

తాగాగా 13 వరకు గడువు పొడగింపు

మెదక్ అర్బన్, ఆగస్టు 10: జలవనరుల్లో ఉచితంగా చేప పిల్లలను వదిలే పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. చేపపిల్లల పంపిణీ కోసం రెండుసార్లు టెండర్లను ఆహ్వానించిన కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఉచిత చేప విత్తనాల పంపిణీ యథావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న నిర్ణయంతో గతనెల జూలైలో జిల్లా మత్స్యశాఖ అధికారులు టెండర్ల ప్రక్రియను చేపట్టారు. నేటికీ ఇంకా టెండర్లే ఖరారు కాకపోవడంతో చేప పిల్లలు వదిలే ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది చిన్నపాటి కారణాలతో చేప పిల్లలను ఆలస్యంగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదలడంతో వేసవి నాటికి ఆశించిన మేర బరువు పెరగకపోవడంతో లాభాలు రాలేదని మత్స్యకారులు వాపోతున్నారు. ఈసారి కూడా చేపపిల్లల పంపిణీ ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు టెండర్లను ఆహ్వానించి పంపిణీదారులు ఎవరూ ముందుకురాలేదు. మూడోసారి ఈ నెల 13 వరకు టెండర్ దాఖలు గడువును పొడగించారు.

బకాయిలే కారణం

గత సంవత్సరం చేప విత్తనాల సరఫరాకు సంబంధించిన బిల్లులు దాదాపు రూ.4.18 కోట్ల వరకు పెండింగ్‌లో ఉండటంతో ఈసారి కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొనేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఉచిత చేప పిల్లల సరఫరా కోసం రాష్ట్రస్థాయిలోనే టెండర్లను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతి ద్వారా ఆహ్వానిస్తోంది. మెదక్ జిల్లాకు సంబంధించి 2024-25 సంవత్సరానికి జిల్లాలోని 1,667 చెరువుల్లో ఉచితంగా 5.23 కోట్ల చేప పిల్లలు అవసరం ఉన్నట్లు మత్స్యశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందు కోసం రెండు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాకపోవడంతో అధికారులు మూడోసారి టెండర్లను పిలిచారు.



మెదక్ లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయం

నగదు బదిలీ చేయండి..

ఉచిత చేప పిల్లల పంపిణీలో కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి మత్స్యకారులను మోసం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. లెక్కింపునకు చాలా సమయం పడుతుందని, బుట్టల్లో పోసి అంచనా వేసి లెక్కింస్తుండడంతో కాంట్రాక్టర్లకే లాభం చేకూరుతుందని, తాము నష్టపోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నేరుగా మత్స్యసహకార సంఘాలకు నగదు బదిలీచేస్తే అక్రమాలకు తావులేకుండా ఉంటుందని, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చునని మత్స్యకారులు పేర్కొంటున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్



తొగుట పోలీస్‌స్టేషన్‌లో మొక్కను నాటుతున్న సీఐ లతీఫ్

ములుగు, ఆగస్టు 10: ఇంటి ముందు మొక్కలు పెంచుకున్నట్లయితే కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛదనంపచ్చదనం కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కార్యక్రమంలో అందరు భాగస్వాములై ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్కలు నాటుకునే కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరారు. నాటిన ప్రతి ఒక్కరు బతికించుకోవడం కోసమే ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఆయన వెంబడి ఏఎస్ఐ శంకర్, అండాలు, హెడ్‌కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎస్ఐ విజయ్‌కుమార్

● **తొగుట:** వన మహోత్సవంలో భాగంగా శనివారం తొగుట పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ లతీఫ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తొగుట ఎస్ఐ రవి కాంతారావు, ఏఎస్ఐలు రాంరెడ్డి, యాదగిరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బెజ్జంకి, ఆగస్టు 10: పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కల్లెపల్లిలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోలిమల్ల నాంపల్లి (65) అనే వృద్ధుడికి కొద్ది రోజులుగా మతి స్థిమితం లేదు. దీనికి తోడు అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక డంపు స్వాధీనం



ఇసుక డంపుతో పోలీసులు

బెజ్జంకి, ఆగస్టు 10: మండలంలోని గాగిల్లాపూర్ శివారులోని కాలువ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసిన నాయకులు



గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు

హుస్నాబాద్, ఆగస్టు 10: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకునేందుకు శనివారం హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ నాయకులు గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేశారు. అనంతరం భారత మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్, సుభాష్‌చంద్ర బోస్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆగస్టు 15వ తేదీన ప్రతీ పౌరుడు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, తోట స్వరూప, చందు, రాంప్రసాద్, అనంతస్వామి, సంతోష్, రాజేశ్ తదితరులున్నారు.

గొర్రెల మందను ఢీకొట్టిన కాంక్రీట్ మిక్సర్

● 15 జీవాల మృతి

గజ్వేల్, ఆగస్టు 10: గొర్రెల మందను కాంక్రీట్ మిక్సర్ ఢీకొట్టిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్లలో శనివారం చోటుచేసుకున్నది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరే మల్లయ్య, బీడ భూమయ్యలు తమ జీవాలను మేత కోసం తీసుకువెళ్లేందుకు గ్రామంలోని రాజీవ్ రహదారిని దాటిస్తున్న క్రమంలో నాగపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సిమెంట్ కాంక్రీట్ మిక్సర్ కంటైనర్ అదుపు తప్పి గొర్రెల మందపైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో 15గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, 20 గొర్రెలకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో తమకు దాదాపుగా రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు గొర్రె కాపరులు తెలిపారు. గాయాలైన గొర్రెలు కూడా బతికే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌కు గొర్రె కాపరులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చదువును 'దూర'ం చేసుకోవద్దు

- పదో తరగతి, ఇంటర్ చదివే వీలు
- ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్స్ షురూ
- ఉచిత పాఠ్యపుస్తకాలు, సెలవు దినాల్లో తరగతులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10: చదువుకుంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చు. చదువు ప్రాధాన్యం ఒక్క మాటలో చెప్పలేం. అయితే, వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారికి మరో అవకాశం కల్పిస్తోంది దూర విద్య(సార్వత్రిక విద్య). చదువుకునేందుకు సరైన అవకాశాలు లేకపోవడం, అర్థాంతరంగా నిలిపివేసిన వారికి, ఉద్యోగాల్లో పదోన్నతులకు ఉపయోగపడేలా తెలంగాణ ఓపెన్ స్కూల్‌తో ఉన్నత చదువులకు బాటలు వేయవచ్చు. ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు తాజాగా ప్రకటన విడుదలైంది.

ఉమ్మడి జిల్లాలో 110 అధ్యయన కేంద్రాలు

ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విద్యను 2008-09లో అందుబాటులోకి తెచ్చింది. ముందుగా పదో తరగతి చదివేందుకు మాత్రమే అవకాశం ఉండగా, ఆ తర్వాత మంచి స్పందన రావడంతో 2010-11లో దూర విద్యలో ఇంటర్‌ను చేర్చారు. అభ్యాసకులకు మరింత మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 110 అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేసి సులభమైన విద్యావిధానంతో పది, ఇంటర్ తరగతులు కొనసాగిస్తున్నారు.

మధ్యలో మానేసిన వారికి సువర్ణావకాశం



ఓపెన్ స్కూల్ అడ్మిషన్ బుక్ లెట్‌ను విడుదల చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి(ఫైల్)

రెగ్యులర్ విద్యతో సమానం..

దూర విద్యలో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు ఇచ్చింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అభ్యాసకులు వృత్తి విద్య కోర్సును ఆప్షన్‌గా ఎంచుకోవచ్చు. ఇక ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ కోర్సులుంటాయి. ఇష్టమైన ఏ సబ్జెక్టులోనైనా కోర్సు పూర్తి చేయవచ్చు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ మీడియాలలో ఏదేని ఒక మీడియంలో చదవవచ్చు. విషయాల ఎంపిక విషయంలో అభ్యాసకుడికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అడ్మిషన్ పొందిన తర్వాత ఐదు సంవత్సరాలలో తొమ్మిది పర్యాయాలు పరీక్ష రాసే అవకాశం ఉంటుంది. దూరవిద్య పూర్తి చేసిన వారు ఉన్నత విద్య, ఉద్యోగాలు పొందడానికి అర్హులు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు ఫీజు రాయితీ ఉంటుంది.

అర్హులెవరంటే..

దూరవిద్యకు 14 ఏళ్లు నిండిన వారందరూ అర్హులే. 15 సంవత్సరాలు నిండి 10వ తరగతి పూర్తయిన వారందరూ ఇంటర్ కోర్సు చదువుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో మానేసిన వారికి, ఫెయిలైన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే వీలుంది. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు ఉంటాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. మహిళలు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్న వారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, వివిధ సంఘ సభ్యులకు, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఇదొక సదావకాశంగా చెప్పవచ్చు.



అడ్మిషన్ ఇలా

ఓపెన్ స్కూల్ విధానంలో పది, ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభంకాగా, వచ్చే నెల(సెప్టెంబరు) 10 తారీఖు వరకు ప్రవేశ గడువు ఉంది. పదో తరగతి ఓసీ కేటగిరీలో పురుషులకు అడ్మిషన్ ఫీజు రూ.1400 చెల్లించాలి. మిగతా వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పురుషులు, మహిళలందరికీ రూ.1000 చెల్లించాలి. ప్రాస్పెక్టస్ ఫీజు రూ.150 అదనం. ఇంటర్ ఓసీ కేటగిరీకి చెందిన వారైతే పురుషులు రూ.1500, మిగతా వారు రూ.1200 చెల్లించాలి. ప్రాస్పెక్టస్ ఫీజు రూ.300, ఆన్‌లైన్‌లో ప్రవేశాలు పొందవచ్చు. తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్ పొందాలి. అడ్మిషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి రసీదు, అడ్మిషన్ ఫారం ప్రింట్‌తో కలిపి అధ్యయన కేంద్రంలో సమర్పిస్తే సమాచారం మెసేజ్ రూపంలో సెల్‌ఫోన్‌కు అందుతుంది.

ఓపెన్ విద్య అందరికి వరం

చదువు మధ్యలో మానేసిన వారికి దూరవిద్య వరంలాంటిందని డీఈవో వెంకటేశ్వర్లు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్హతలు పెంపొందించడానికి, ఉపాధి అవకాశాలకు దూర విద్య దోహదపడుతుందన్నారు. గతేడాది పదో తరగతిలో 71.04 శాతం, ఇంటర్ 60.72 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఓపెన్ విద్యకు సంబంధించిన సమాచారం కోసం 8008403635 నంబరును సంప్రదించాలని కోరారు.



బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘాల నాయకులు

శ్రీనివాస్‌నగర్‌లో ఇంటర్‌సిటీ రైలు ఆపాలి

- కేంద్రమంత్రికి పలు సంఘాల వినతి

మాసాయిపేట, ఆగస్టు 10: మాసాయిపేట మండల కేంద్రంలోని శ్రీనివాసనగర్ రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ఆపాలని, మేడ్చల్ వరకు నడిచే లోకల్ రైళ్లను ఒడియారం వరకు పొడగించాలని ఉపాధ్యాయ, వర్తక, వాణిజ్య సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం వారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసనగర్ రైల్వేస్టేషన్‌లో గతంలోలా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని, దీంతో మాసాయిపేటతోపాటు వెల్దుర్తి, తూప్రాన్, చేగుంట తదితర మండలాలకు చెందిన ఉద్యోగులు, వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని కేంద్ర మంత్రికి వివరించారు. కూరగాయల వ్యాపారులు ఈ ప్రాంతాల నుంచి ఇటు హైదరాబాద్, అటు నిజామాబాద్ వరకు ప్రయాణిస్తుంటారని వివరించారు. గతంలో ఇక్కడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఉండేదని గుర్తు చేశారు. మేడ్చల్ వరకు నడుస్తున్న ఎంఎంటీఎస్‌ను ఒడియారం వరకు పొడగించాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉపాధ్యాయ సంఘ నాయకులు రంగారెడ్డి, శర్మ, ఇమ్మడి వెంకటేశం, ధర్మపురి సంజయ్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

చేర్యాల, ఆగస్టు 10: కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామశివారులో విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. గడ్డిమేస్తూ పాడిగేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని, దీంతో రూ.60వేల నష్టం వాటిల్లిందని పుట్ట కరుణాకర్ వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీటి సంపులో పడి వానరాల మృతి

బెజ్జంకి, ఆగస్టు 10: ఆలయ ఆవరణలోని నీటి సంపులో పడి ఐదు వానరాలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వెనకాల ఉన్న నీటి సంపు ఉండగా, దానికి ఎవరూ వినియోగించడం లేదు. అయితే, ఆ సంపులో ఎప్పుడు పడ్డాయో కానీ, ఐదు వానరాలు మృత్యువాతపడ్డాయి. వాటి కళేబరాలు నీటిపై తేలియాడుతుండగా, శనివారం భక్తులు గుర్తించారు. వాటిని బయటకు తీసి, మాజీ సర్పంచ్ నర్సయ్య వానరాలకు అంత్యక్రియలు చేశారు. ఆలయ ఆవరణలోని ఆ నీటి సంపును కొన్నేళ్లుగా ఎవరూ వినియోగించడం లేదు. ఆలయ వెనుక భాగంలో ఉండటంతో దానిని ఎప్పుడో తప్ప పట్టించుకోరు. ఈ క్రమంలో వానరాలు పడిన విషయాన్ని ఆలస్యంగా గుర్తించారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ



నారాయణఖేడ్, ఆగస్టు 10: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పార్లమెంట్ సమావేశాలు ముగిసిన క్రమంలో శనివారం ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోవు పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాల ఎంపీలకు మాట్లాడేందుకు అధిక సమయాన్ని కేటాయించాలని ఆయనను కోరారు.

సిద్దిపేట నుండి కొమురవెల్లికి.. పాదయాత్రగా వచ్చిన అదనపు కలెక్టర్



మల్లన్నను దర్శించుకున్న అదనపు కలెక్టర్

చేర్యాల, ఆగస్టు 10: సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సాధారణ భక్తుడిగా జిల్లా కేంద్రం నుంచి కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి పాదయాత్రగా వచ్చారు. శనివారం ఉదయం అక్కడి నుంచి నడుచుకుంటూ బయలుదేరిన ఆయన ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందించగా, ఈవో బాలాజీశర్మ స్వామివారి ప్రసాదం అందించారు.

జమ్మూకశ్మీర్ ఎఫ్‌సీఐ జీఎంగా నర్సాపూర్ వాసి



నర్సాపూర్, ఆగస్టు 10: జమ్మూకశ్మీర్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) జనరల్ మేనేజర్‌గా నర్సాపూర్ మండలం మహ్మదాబాద్‌కు చెందిన చత్రునాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. మారుమూల తండాలో జన్మించిన చత్రునాయక్ కష్టపడి చదివి ఎఫ్‌సీఐలో ఉద్యోగం సంపాదించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పలు హోదాల్లో పని చేశారు. మొన్నటి వరకు ముంబైలోని ఎఫ్‌సీఐ డీజీఎంగా ఉన్న ఆయన పదోన్నతిపై జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి బదిలీపై వెళ్లారు.



బైక్ ర్యాలీగా వస్తున్న హనుమాన్ భక్తులు

వర్షాల కోసం హనుమాన్ ఆలయాల్లో పూజలు

కల్హేర్, ఆగస్టు 10: వర్షాకాలం ప్రారంభమై రెండు మాసాలు కావస్తున్నా సరైన వర్షాలు కురవక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రమైన కల్హేర్‌కు సరిహద్దున ఉన్న కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల పరిధిలోని వెలగనూరు, ముంగ్లూర్ గ్రామాలకు చెందిన వందలాది మంది హనుమాన్ భక్తులు, రైతులు వేర్వేరుగా బైక్ ర్యాలీ నిర్వహిస్తూ శనివారం కల్హేర్‌కు చేరుకున్నారు. కల్హేర్‌లోని హనుమాన్ మందిర్, రామాలయాల్లో స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, వర్షాలు కురిపించాలని ప్రార్థించారు. అనంతరం కల్హేర్ మండలంలోని మహాదేవ్‌పల్లి, మాసాన్‌పల్లి, ఇందిరానగర్, మార్డి, బీబీపేట, ఫత్తేపూర్, పిట్లం మండలంలోని తిమ్మానగర్, మార్‌దండ, పిట్లం, నిజాంసాగర్ మండలంలోని ముంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, బ్రహ్మణపల్లి తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లోనూ వర్షాల కోసం పూజలు చేశారు. బైక్ ర్యాలీగా కల్హేర్‌కు వచ్చిన హనుమాన్ భక్తులకు కల్హేర్ మాజీ ఎంపీటసీ సంగప్ప, మాజీ సర్పంచ్ లచ్చవ్వ బాలయ్య, బీజేపీ నాయకులు కిష్టయ్య, విఠల్, పండరీ, పరుశురాం, బజరంగదళ్, రామాలయ సేవక బృందం, యువజన సంఘాల బాధ్యులు స్వాగతం పలికారు.

పంచాక్షరి జపయజ్ఞానికి సిద్దేశ్వరాలయం ముస్తాబు



జపయజ్ఞం కోసం ఏర్పాట్లు

కంగ్టి, ఆగస్టు 10: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్న కంగ్టి సిద్దేశ్వరాలయంలో ఈనెల 12న శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని శివ పంచాక్షరి జపయజ్ఞం వైభవంగా కొనసాగనుంది. పసల్వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మహేశ్వర శర్మసిద్ధంతి ఆధ్వర్యంలో దారం సౌమ్య, సంజయ్ దంపతులు ఈ బృహత్కార్యక్రమం చేపడుతున్నారు. వివిధ సంగీత స్వరాల మధ్య శివ పంచాక్షరి జపం, శివ నామామృతం, మహా హారతి, అన్న ప్రసాద వితరణ, కొనసాగనున్నాయి. జిల్లాతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలకు అత్యంత చేరువగా ఉన్న ఈ ప్రసిద్ధ పుణ్య క్షేత్రానికి వేలాదిగా భక్తులు వస్తారు. ఈ మేరకు సంజయ్, సౌమ్య దంపతులు శనివారం కంగ్టిలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఊరంతా ఒక్కటై.. ఆ నలుగురుగా నిలిచి..

- అనాథ మహిళకు గ్రామస్థుల అంత్యక్రియలు
- 25 ఏళ్ల క్రితం మతిస్థిమితం లేక గ్రామానికి..
- అప్పటి నుంచి గ్రామస్థుల చేయూతతోనే బతుకు



రాములమ్మ(ఫైల్)

జోగిపేట, ఆగస్ట్ 10, ఈనాటి బంధమేనాటిదో అన్నట్లుగా ఎక్కడి నుంచో వచ్చి గ్రామంలో నివసిస్తూ మృతి చెందిన ఓ అనాథ వృద్ధురాలికి ఊరంతా కలిసి అంత్యక్రియలు జరిపిన ఉదాత్తమైన ఘటన మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఊరు ఊరంతా ఏకమై, ఒక్కటిగా నిలిచి, ఆమెకు అంత్యక్రియలు జరిపిన సంఘటన గ్రామస్థుల పెద్ద మనసుకు అద్దం పట్టింది.

సుమారు 25 ఏళ్ల క్రితం ఓ మధ్యవయస్కురాలు రాంసాన్‌పల్లి గ్రామానికి చేరింది. అప్పటికే ఆమె కాసింత మతిస్థిమితం తప్పినదానిలా ఉండేది. వివరాలడిగితే.. తాను రాయలసీమ ప్రాంతానికి చెందిన బాగా సాగిన కుటుంబానికి చెందిన మహిళనని చెప్పుకునేదట.. పేరు రాములమ్మ అని చెప్పినప్పటికీ, సొంతూరు ఏదంటే మాత్రం సమాధానం చెప్పేది కాదట. పైపెచ్చు, తాను ఇక్కడే ఉంటానని ఏడ్చేదట. దీంతో గ్రామస్థులు సదరు మహిళను అక్కున చేర్చుకున్నారు. గ్రామంలోని పంచాయతీ భవనంలో ఉండమని చెప్పి, అక్కడే ఆశ్రయం కల్పించారు. గ్రామస్థులంతా కలిసి సమావేశమై సదరు మహిళను తమ గ్రామస్థురాలిగానే భావించి, ఆమెకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు కూడా ఇప్పించారు. దీంతో, రాములమ్మ 25 ఏళ్లుగా గ్రామంలోనే నివసిస్తోంది. అయితే, శుక్రవారం రాత్రి ఆమె కన్నుమూసింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఇన్నాళ్లు తమ ఆదరణతోనే బతికిన ఆమెకు కలిసికట్టుగా అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. గడపకింత చొప్పున చందాలు వేసుకోవడంతో పాటు ప్రతీ ఇంటి నుంచి ఒకరు హాజరై రాములమ్మకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. అనాథగా తమ ఊరికి చేరిన రాములమ్మను అక్కున చేర్చుకోవడమే కాకుండా... మృతిచెందిన రాములమ్మను, తమ గ్రామ మహిళగా భావించి, అంత్యక్రియలు కూడా నిర్వహించి తమ ఉదాత్తతను, పెద్ద మనసును చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారా గ్రామస్థులు.



రాములమ్మ మృతదేహాన్ని మోస్తున్న గ్రామస్థులు

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

పుల్‌కల్, ఆగస్టు, 10: మండల కేంద్రం చౌటకూర్‌కు సమీపంలో సంగారెడ్డి, నాందేడ్-అకోలా 161వ జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడిన సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని శివంపేట గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీహరి (38) జోగిపేటలో ఆటోను అద్దెకు మాట్లాడుకుని కిరాణ సామగ్రి తీసుకుని వస్తున్నాడు. ఆటో డ్రైవర్ చౌటకూర్ సమీపంలోకి రాగానే బసన్నవాగు వద్ద మరో లారీని ఓవర్‌టేక్ చేయబోతుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో కుమ్మరి శ్రీహరి తలకు బలమైన గాయాలై, కాలు విరిగింది. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆటో అతివేగంగా, ఆ జాగ్రత్తగా నడపడం వల్ల బోల్తా కొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన వారిని సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, కుమ్మరి శ్రీహరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.



ఆటోలో ఇరుక్కుపోయిన శివకుమార్

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో..

టేక్మాల్, ఆగస్టు 10: చెట్లకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఆటో ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మాట్‌పల్లి గ్రామశివారులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతులగూడ గ్రామానికి చెందిన శివకుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం జోగిపేట వైపు నుంచి బొడ్మాట్‌పల్లి వైపు వస్తుండగా, 161 జాతీయ రహదారిపై చెట్లకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీ కొన్నాడు. దీంతో శివకుమార్‌తో పాటు ఆటోలో ఉన్న మరో వ్యక్తికి తీవ్రంగా గాయలైయ్యాయి. గమనించిన హైవే సిబ్బంది గాయపడిన వారిని అంబులెన్స్‌లో జోగిపేట ఆసుపత్రికి తరలించారు.





లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్, ఆగస్టు 10 : జహీరాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు 13 మంది లబ్ధిదారులకు రూ.3.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయ నిధితో ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చేగుంట : చేగుంట, నార్సింగి, మండలంలోని పలు గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే చేగుంట మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ తండ్రి దశదిన కర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

● నారాయణఖేడ్ : మండల పరిధిలోని చందర్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ నారాయణకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.22,500 ఆర్థిక సహాయం మంజూరు కాగా శనివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చెక్కును అందజేశారు. ఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

● మనోహరాబాద్ : మనోహరాబాద్‌లోని తన నివాసంలో 13 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మెదక్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ హేమాలతశేఖర్‌గౌడ్ శనివారం పంపిణీ చేశారు. రూ.3.50 వేల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఎల్‌వోసీ ఇప్పించిన ఎమ్మెల్యే రోహిత్

నిజాంపేట, ఆగస్టు 10 : రాంపూర్ గ్రామానికి చెందిన ఎం.నరసింహాచారి నెల రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్‌లో చేరాడు. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న విషయాన్ని మాజీ సర్పంచ్ జెల్లా రజిత మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన నిమ్స్ వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఇప్పించారు. శనివారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు ఎల్‌వోసీని అందజేశారు.

ఖేడ్‌లో త్వరలో అందుబాటులోకి ఎంవీఐ సేవలు

తొలగనున్న వాహన లైసెన్సు, రిజిస్ట్రేషన్ ఇబ్బందులు



నారాయణఖేడ్‌లో ఎంవీఐ సేవల కోసం సిద్ధం చేస్తున్న కార్యాలయం

నారాయణఖేడ్, ఆగస్టు 10 : రవాణా శాఖ సేవలు పొందాలంటే నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలు వ్యయ ప్రయాసాలకు గురి కావాల్సి వచ్చేది. స్థానికంగా కార్యాలయం లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు జహీరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఏ పనులకు వెళ్లినా రెండు మూడు రోజులు తిరగాల్సి వస్తుండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సమయం వృథా అవుతుండడం, పనులు త్వరగా కాకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. దీంతో చాలా మంది డ్రైవింగ్ లైసెన్సు లేకుండానే వాహనాలు తోలడం, వాహనాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్ లేకుండానే నడుపుతున్నారు. ఖేడ్‌లోనే ఎంవీఐ సేవలు అందుబాటులోకి తేవాలని వాహనదారులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి దృష్టికి ప్రజలు సమస్యను తీసుకెళ్లడంతో, ఆయన రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలిసి ఈ ప్రాంత వాహనదారుల ఇబ్బందులు వివరించారు. స్పందించిన మంత్రి ఖేడ్‌లో వారంలో రెండురోజులపాటు క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి ఎంవీఐ సేవలు అధికారులను ఆదేశించారు. నారాయణఖేడ్ పట్టణంలో వినియోగంలో లేని రైతబజార్‌లో నిరుపయోగంగా ఉన్న భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జహీరాబాద్ ఎంవీఐ వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ఈ ప్రాంత వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంవీఐ సేవలతో ప్రజలకు ఊరట : ఎమ్మెల్యే సంజీవరెడ్డి



స్థానికంగా ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు చేయనుండడంతో వాహనదారులు ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్లసంజీవరెడ్డి అన్నారు. ప్రజల కోరిక మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగానే, ఆయన తక్షణం స్పదించారని తెలిపారు. ఖేడ్‌లో ఎంవీఐ సేవలు వారంలో రెండు రోజులు అందించాలని రవాణ శాఖ డిప్యూటీ కమిషనర్ కు ఆదేశించారన్నారు. అతి త్వరలో ఖేడ్‌లో కార్యాలయం ఏర్పాటు అవుతుందని, దీంతో సమస్యలు తీరుతాయన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

మైనారిటీ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ వసీం అక్రం



విద్యార్థి బుక్‌ను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ అక్రం

జహీరాబాద్, ఆగస్టు 10 : గురుకుల విద్యాలయం విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండ చూడాలని సంగారెడ్డి జిల్లా మైనారిటీ గురుకులాల కోఆర్డినేటర్ వసీం అక్రం ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని పస్తాపూర్, మండలంలోని బూచనెల్లి మైనార్టీ గురుకులాలను ఆయన సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

అవినీతిని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

● టేక్మాల్ సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి



అభివృద్ధి పనుల పత్రాలను చూపుతున్న టేక్మాల్ సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి

టేక్మాల్, ఆగస్టు 10 : టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘాన్ని(పీఏసీఎస్) కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశాను తప్ప, ఏ కుంభకోణం చేయలేదని, తాను అవినీతి చేసినట్లు నిరూపిస్తే ఏశిక్షకైనా సిద్ధమని టేక్మాల్ ప్రాథమిక సహకారం సంఘం చైర్మన్ యశ్వంత్‌రెడ్డి అన్నారు. శనివారం టేక్మాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తనపై డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారని, ఓ డైరెక్టర్‌కు ఆరోగ్య సమస్య వచ్చిందని సాకు చెప్పి రిటన్ తీసుకున్నారని గుర్తుచేశారు. తాను పదేళ్లుగా సొసైటీ చైర్మన్‌గా పనిచేస్తున్నానని, జిల్లాలో ఆదర్శవంత సంఘంగా తీర్చిదిద్దానన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కొందరు తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సొసైటీ లావాదేవీలను వివరించారు. తనపై వస్తున్న ఆరోపణలను రైతుల సమక్షంలోనే తేల్చుకుందామని సవాలు విసిరారు. టేక్మాల్ సొసైటీని అభివృద్ధి పథంలో నడపడమే తన లక్ష్యమని అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ వెంకయ్య, డైరెక్టర్లు శ్రీశైలం, కిషన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరప్ప, నాయకులు తదితరులు ఉన్నారు.

భూర్గుపల్లిలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లు ప్రారంభం

హవేళిఘణపూర్, ఆగస్టు 10 : మండలంలోని భూర్గుపల్లి ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కో ఆర్డినేటర్ నాగులు మీరా, అసిస్టెంట్ కోఆర్డినేటర్ లక్ష్మీకాంతం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్‌లు సెప్టెంబరు 8వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. అక్టోబరు నెల నుంచి తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అడ్మిషన్ల కోసం మరిన్ని వివరాలను తెలుసుకోవాలంటే 9490242898 నంబరును సంప్రదించాలని తెలిపారు.

'విజయ దండోరా'ను జయప్రదం చేయండి

కంగ్టి, ఆగస్టు 10 : ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగల విజయ దండోర సభను జయప్రదం చేయాలని మాదిగ జర్నలిస్టుల ఫోరం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి రమేష్ కోరారు. శనివారం వారు కంగ్టిలో మాట్లాడుతూ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మందకృష్ణ చేసిన పోరాటం వెలకట్టలేనిదన్నారు. దండోరాకు మాదిగలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

నేడు వెల్దుర్తిలో కంటి వైద్య శిబిరం

వెల్దుర్తి, ఆగస్టు10 : ఆక్సివిజన్ లేజర్ కంటి ఆసుపత్రి మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శనివారం వెల్దుర్తి ఈవో బలరాంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అంత్యక్రియలకు హాజరైన ఆవుల

మాసాయిపేట, ఆగస్టు 10 : కాంగ్రెస్ మండల సీనియర్ కార్యకర్త ముక్క దశరథం తల్లి పోచమ్మ శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించగా పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజురెడ్డి హాజరయ్యారు. దశరథం కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చట్టవిరుద్ధం

● అతిక్రమిస్తే జైలు, జరిమానా తప్పదు

● సంగారెడ్డి జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10 : బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించబడిందని, అతిక్రమిస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా తప్పదని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డిలోని సంజీవనగర్ లేబర్ అడ్డాలో పొగాకు వలన కలిగే అనర్థాలపై కార్మికులకు కరపత్రాల ద్వారా శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు, ప్రచారంపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. విద్యాసంస్థల వద్ద 100 మీటర్ల వరకు పొగాకు సేవించడం, ఉత్పత్తుల అమ్మకం చేయరాదన్నారు. 18ఏళ్ల లోపు వారికి పొగాకు వస్తువులు అమ్మరాదని సూచించారు. పొగాకు ప్రాణాంతకం, క్యాన్సర్‌కు కారకమన్నారు. పొగాకు ఉత్పత్తులకు ప్రతీ ఒక్కరు దూరంగా ఉండాలని ఆయన కోరారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ

నారాయణఖేడ్, ఆగస్టు 10 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఖేడ్‌లోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం సంఘం నాయకులతో కలిసి డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు.

రిజర్వేషన్ల పితామహుడు జస్టిస్ పుంజాల శివశంకర్

● మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టి జగపతి



శివశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మెదక్ అర్బన్, ఆగస్టు 10: రిజర్వేషన్ల పితామహుడు మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి, జస్టిస్ స్వర్గీయ పుంజాల శివశంకర్ అని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టి జగపతి పటేల్ కొనియాడారు. మున్నూరు కాపు సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రాందాస్ చౌరస్తాలో పుంజాల శివశంకర్ 95వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగపతి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలో 1977-78లో బీసీలకు రిజర్వేషన్ అమలు పర్చడానికి కృషి చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్‌కుమార్, కోఆర్డినేటర్ వీర్‌కుమార్, నాయకులు బండ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏడు నెలలుగా జీతాలు రాక సతమతం అవుతున్నాం

మాజీ మంత్రి హరీశ్‌కు పారిశుధ్య కార్మికుల వినతి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 10: 'మాకు ఏడు నెలల నుంచి జీతభత్యాలు రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం' అని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే హరీశ్‌రావుకు విన్నవించారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామ పర్యటనలో ఉన్న ఆయనను పారిశుధ్య కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీతాలు వచ్చే విధంగా కృషి చేస్తానని హరీశ్‌రావు కార్మికులతో అన్నారు.

ఫైలేరియా నివారణపై అవగాహన



మాత్రలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రోజాశర్మ

జిన్నారం, ఆగస్టు 10 : బొల్లారం థర్మల్ సిస్టమ్స్ పరిశ్రమలో జాతీయ ఫైలేరియా నివారణ అవగాహన, మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి ప్రారంభించారు. శనివారం పరిశ్రమలో కార్మికులకు మాత్రలను ఇచ్చారు. పారిశ్రామిక సమాఖ్య కార్యదర్శి ఆనందరావు, మెడికల్ ఆఫీసర్ నిర్మలారెడ్డి, డాక్టర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం

తూప్రాన్, ఆగస్టు 10: నర్సంపల్లి గ్రామంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శనివారం మాజీ సర్పంచు కత్తుల సత్యనారాయణ ప్రారంభించారు. తూప్రాన్ ఆయుర్వేద ఆస్పత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ రుక్సానా అన్వర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన ఆయుర్వేద మందులను ఉచితంగా అందజేశారు. ఆయుష్ విభాగం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చింతల రవి, పంచాయతీ కార్యదర్శి స్వాతి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆయుష్ వైద్యులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 4 తులాల బంగారం, 75 తులాల వెండి ఆభరణాలు, రూ.49 వేల నగదు అపహరణ

తూప్రాన్, ఆగస్టు 10: తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ జరిగిన సంఘటన మండలంలోని నాగులపల్లిలో శనివారం చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. నాగులపల్లికి చెందిన అబ్బూరి అనసూయ ఓ కంపెనీలో పని చేస్తు జీవిస్తుంది. రోజులాగే శనివారం ఆమె కంపెనీకి వెళ్లింది. కొడుకు అరవింద్ స్కూల్‌కు సెలవు కావడంతో ఇంటికి తాళం వేసి పొలం వద్దకు వెళ్లాడు. గుర్తుతెలియని దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న నాలుగు తులాల బంగారు, 75 తులాల వెండి ఆభరణాలు, రూ.49 వేల నగదు చోరీ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించండి

● మంత్రి దామోదర్‌ను కోరిన మాజీ సర్పంచ్ రమేష్



మంత్రి దామోదర్‌తో రమేష్

వట్‌పల్లి, ఆగస్టు 10 : వట్‌పల్లి ఏఎంసీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని షాద్‌నగర్ మాజీ సర్పంచ్ రమేష్ శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి విన్నవించారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి అవకాశం కల్పించాలని కోరినట్లు రమేష్ తెలిపారు.

చెరువుల కలుషితంపై చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ నాయకుల డిమాండ్

రామచంద్రాపురం, ఆగస్టు 10 : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల కలుషితంపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పట్టణ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇంద్రానగర్ సర్కిల్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగండ్ల హుడా, ఇతర కాలనీలు, అపార్ట్‌మెంట్ల నుంచి వస్తున్న మురుగునీరు నేరుగా వనం చెరువులో చేరుతుందన్నారు. వర్షం పడిన సమయంలో మురుగునీరు రోడ్లపై ప్రవహించి ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని మండిపడ్డారు. స్థానికంగా ఏర్పడ్డ కాలనీలు, విల్లాలు దాదాపుగా మేళ్ల చెరువులోకి మురుగునీటిని విడుస్తున్నాయని తెలిపారు. ఎస్‌టీపీ లేఅవుట్‌లు నేరుగా చెరువుల్లో కలుపుతున్నారని ఆరోపించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమానికి సన్నద్ధమౌతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీపీ రెడ్డి, భరత్‌కుమార్, కృష్ణ, వడ్డె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటవాసికి డాక్టరేట్



పీహెచ్‌డీ పొందిన శ్వేత

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10 : సదాశివపేటకు చెందిన సిలివేరి శ్వేత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పొందారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా సాధించారు. ఆమెను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అభినందించారు. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన శ్వేత ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటూ ఓయూ నుంచి డాక్టరేట్ పొందడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. పట్టుదలతో చదివి చదివి డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



విలేజ్ బ్యాగును ప్రారంభిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి, ఆగస్టు 10 : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విలేజ్ బ్యాగును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విలేజ్ బ్యాగును అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టార్ అధికారి భాస్కర్, నోడల్ అధికారి అంజాగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, వీవో మహిపాల్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ గౌతమి, ఎర్త్ ఫౌండేషన్ సభ్యులు ఆంజనేయులు, రాజు, నిహారిక, ప్రశాంత్ తదితరులున్నారు.

ప్రమాదాల నివారణకు కన్విన్స్ మిర్రర్ ఏర్పాటు

శివ్వంపేట, ఆగస్టు 10 : మూలమలుపుల వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ఉసిరికపల్లి చౌరస్తాలో కన్విన్స్ మిర్రర్(కుంభాకార దర్పణంను) శనివారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ దీంతో వాహన చోదకులకు ఎంతో సులువు అవుతుందన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

● నేటి నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

● బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్



మెదక్ గాంధీనగర్ మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్రపరుస్తున్న బీజేపీ నాయకులు

చేగుంట, ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. చేగుంట మక్కరాజిపేట్ చౌరస్తాలోని అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రావ్ విగ్రహాలను శనివారం బీజేపీ నాయకులు శుభ్రపరిచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ కేంద్ర, రాష్ట్ర శాఖల పిలుపు మేరకు చేగుంటలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్, నాయకులు గోవింద్, రవి, సాయిబాబ, నర్సింలుగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో గాంధీ విగ్రహం శుభ్రం

మెదక్ అర్బన్, ఆగస్టు 10 : హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని బీజేపీ మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, పార్టీ నాయకులు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి 15 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి విఠలేష్, నాయకులు లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సంగారెడ్డిలో తిరంగా యాత్ర

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10 : సంగారెడ్డి పట్టణంలో ఆదివారం తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. తిరంగా యాత్రకు బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్‌చానల్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.



ముందు గొయ్యి.. పక్కన బురద

అల్లాదుర్గం, ఆగస్టు 10 : మండలంలోని చిల్వర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన చిల్వర్-మాందాపూర్ రహదారిలోని కల్వర్టుపై ఓవైపు గొయ్యి పడగా మరోవైపు కుంగిపోయి బురదమయంగా మారింది. గుంతపై ముళ్ల కంచె వేసినప్పటికీ రాత్రివేళ గమనించకుండా వాహనదారులకు ప్రమాదం తప్పదు.



పంచాయతీ దారి బురదమయం

మనూరు, ఆగస్టు 10: మండలంలోని అతిమ్యాల్ గ్రామంలో పంచాయతీ కార్యాలయానికి, పాఠశాలలకు వెళ్లే వీధి కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు బురదమయంగా మారుతుంది. నడవాలంటే చెప్పులు చేతులో పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే సీసీ రోడ్డుని నిర్మించాలని కోరుతున్నారు.